క్లుప్తంగా

పర్వతరెడ్డికి అభినందనల వెల్లువ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని రామ్‌జీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో పలువురు అభినందనలను తెలియజేశారు. యువజన విభాగ నేతలు యనమల చంద్రారెడ్డి, లోకేష్‌రెడ్డి సత్కరించారు. రాజేష్, పవన్, భవదీశ్, లిఖిత్ తదితరులు పాల్గొన్నారు.

- పార్టీ నాలుగో డివిజన్ ఇన్‌చార్జి సంధానీ, కోఆర్డినేటర్ మధుసూదన్ ఆధ్వర్యంలో సన్మానించారు.
- పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొణిదల సుధీర్ ఆధ్వర్యంలో 50వ డివిజన్ నేతలు, కార్యకర్తలు అభినందనలను తెలియజేశారు.

చీటింగ్ కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): ఓ మహిళను నమ్మించి మోసగించిన ఆమె తల్లి, చెల్లి, మరిదిపై కేసును వేదాయపాళెం పోలీసులు మంగళవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నేతాజీనగర్‌కు చెందిన శ్రీవాణి దంపతులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. అమెరికాలో ప్రస్తుతం వీరు ఉంటున్నారు. శ్రీవాణికి తల్లి, చెల్లి, మరిది తరచూ ఫోన్ చేసేవారు. సంపాదించిన మొత్తంలో కొంత తమకిస్తే జాగ్రత్తగా దాచి అవసరమైనప్పుడు ఇస్తామని నమ్మించారు. దీంతో ఆమె పలు ఖాతాల నుంచి వారికి రూ.రెండు కోట్లు పంపారు. గతేదాది తండ్రి మరణించడంతో ఆమె నెల్లూరొచ్చారు. అనంతరం తాను పంపిన రూ.రెండు కోట్ల విషయమై వారిని ప్రశ్నించారు. నగదు లావాదేవీలను తండ్రి చూసేవారని, ఆయన మరణించడంతో తమకేమీ సంబంధం లేదని బుకాయించారు. దీనిపై నిలదీయగా, మరోమారు నగదు అడిగితే అంతుచూస్తామని బెదిరించారు. ఈ మేరకు పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు.

విద్యార్హత లేకపోయినా 'పది' పూర్తి చేసే అవకాశం

కొడవలూరు: ఎలాంటి విద్యార్హత లేకపోయినా, 14 ఏళ్లు నిండితే పదో తరగతి పూర్తి చేసే అవకాశాన్ని సార్వత్రిక విద్య ద్వారా కల్పించారని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. నార్తురాజుపాళెంలోని జెడ్పీ హైస్కూల్లో ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వెల్ఫేర్ సహాయకులు, సీఆర్‌ఎమ్‌టీలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఎంఈఓ అంకయ్య మాట్లాడారు. నార్తురాజుపాళెంలోని జెడ్పీ హైస్కూల్లో పది, ఇంటర్‌కు అడ్మిషన్లను పొందొచ్చని చెప్పారు. సందేహాలుంటే సార్వత్రిక విద్య మండల సమన్వయకర్త, హెచ్‌ఎం ఓబులేసును సంప్రదించాలని సూచించారు.

చేనేత కార్మికుల అభివృద్ధే లక్ష్యం

కోవూరు: చేనేత పరిశ్రమకు నూతన శక్తిని నింపి, కార్మికులను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చేనేత శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. కోవూరు క్లస్టర్ పరిధిలోని పాటూరు, ఐనమడుగు, గుమ్మళ్లదిబ్బ గ్రామాల చేనేత కార్మికులకు అవగాహన సదస్సును పట్టణంలోని గుమ్మళ్లదిబ్బ రామాలయం వద్ద మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మొదటి విడతలో భాగంగా 86 మంది చేనేత కార్మికులకు ఆధునిక యంత్ర సామగ్రి మంజూరైందని, త్వరలో వీటిని అందజేయనున్నామని వెల్లడించారు.

ఉచిత దంత వైద్య శిబిరం

పొదలకూరు: పట్టణంలోని విజేత స్కూల్లో నెల్లూరు స్మైల్ దంత వైద్యశాల వారు ఉచిత దంత వైద్య శిబిరాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.భవాని, డాక్టర్ ఎస్‌కే యాసిన్ 200 మంది విద్యార్థులకు దంత పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ జి.కామాక్షి పాల్గొన్నారు.

డెంగీ మాసోత్సవాలు



పొదలకూరు: డెంగీ మాసోత్సవాల్లో భాగంగా మహ్మదాపురం పీహెచ్‌సీ పరిధిలోని చెన్నారెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం మురుగు కాలువల్లో గంబూసియా చేపల్ని వదిలిపెట్టారు. ఆరోగ్యశాఖ అధికారులు మాట్లాడుతూ ప్రతి శుక్రవారాన్ని డ్రైడేను పాటించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు మజహరుద్దీన్, షాజిదా, పంచాయతీ సెక్రటరీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

⇨ **ముత్తుకూరు(పొదలకూరు):** ముత్తుకూరులో మంగళవారం మురుగునీరు నిల్వ ప్రాంతాల్లో గంబూసియా చేపలను వదిలిపెట్టారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి దేవిక్రుప, ఆరోగ్య శాఖాధికారులు, ఉద్యోగులు షఫ్కూర్, నిర్మలమ్మ, బాలకృష్ణ, కల్యాణ్, రాజగోపాల్‌నాయుడు, నవీన్ పాల్గొన్నారు.

తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణకు కృషి



మాట్లాడుతున్న సుజాత

నెల్లూరు(అర్బన్): తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణకు ఆశ కార్యకర్తలు కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ సుజాత పేర్కొన్నారు. పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న ఆశ నోడల్ అధికారులతో సంతపేటలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. తమ పరిధిలో ఉన్న ప్రతి ఇంటినీ సందర్శించాలని సూచించారు. మూడు నెలల నుంచి 15 నెలలున్న బిడ్డలకు విరేచనాలు, శ్వాస సమస్యలు, వ్యక్తిగత పరిశుభ్రత తదితరాలను గుర్తించి ఈ – ఆశ యాప్‌లో నమోదు చేయాలని కోరారు.

జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఉమామహేశ్వరి, ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, డీపీఎంఓ రమేష్, డీఎస్‌ఓ బ్రిజిత మార్గరెట్, డీపీహెచ్ఎన్వో నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మిక సంఘ మహాసభ



మాట్లాడుతున్న ప్రసాద్



హాజరైన ఆటో కార్మికులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలో ఆటో కార్మికులపై పోలీసులు విధిస్తున్న ఈ – చలానాలు, అధిక పెనాల్టీలను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, సురేష్ రాజా డిమాండ్ చేశారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆటో కార్మిక సంఘ నగర మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన వారు మాట్లాడారు. వాహనమిత్ర పథకం ద్వారా ఆటో కార్మికులకు రూ.15 వేలను ప్రభుత్వం వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం 31 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా రవీంద్రబాబు, బాబూరావు, ట్రెజరర్‌గా నివాస్, నగర కమిటీ గౌరవాధ్యక్షుడిగా నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. నేతలు కాయం శ్రీనివాసులు, మూలం ప్రసాద్, రాంబాబు, సుధాకర్, దయాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

జయభారత్ ఆస్పత్రిలో అన్నదానం



నెల్లూరు(అర్బన్): నగరంలోని జయభారత్ ఆస్పత్రిలో ఎస్బీఐ ఉద్యోగుల సహకారంతో అన్నదానాన్ని రోజూ నిర్వహించడాన్ని హాస్పిటల్ ట్రస్ట్ సభ్యుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం అభినందించారు. అన్నదాన కార్యక్రమాన్ని ఎస్బీఐ విశ్రాంత ఉద్యోగి వరదరాజులు ప్రారంభించి ఏడాది పూర్తయిన తరుణంలో ఆయనతో పాటు టీమ్ సభ్యులను మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా వరదరాజులు మాట్లాడారు. నిత్యం 150 మందికిపైగా భోజనం చేస్తున్నారని చెప్పారు. ఇప్పటి వరకు 55 వేల మందికి ఆహారాన్ని అందించామని, దీనికి మిత్రులు, దాతల సహకారమే కారణమని తెలిపారు. ఆస్పత్రి ట్రస్ట్ సభ్యుడు గుర్రం సుధాకర్, జనరల్ మేనేజర్ గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లాగిన్‌లో హోదాను మార్చాలని వినతి



నెల్లూరు(అర్బన్): ట్రెజరీ శాఖ లాగిన్‌లో హెల్త్ ఎడ్యుకేటర్ హోదాను డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా మార్చాలని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ అసోసియేషన్, అమరావతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేజర్ల సుధాకర్‌రావు, అధ్యక్షుడు వెంకటరమణ కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఖజానా, లెక్కల సంచాలకుల కార్యాలయ జేడీ శ్రీనివాసులునాయక్‌కు వినతిపత్రాన్ని మంగళగిరిలో అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. సీఎఫ్‌ఎమ్మెస్ లాగిన్‌లో పేరును డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్లుగా నమోదు చేసేలా ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వివధ అంశాలపై ఎమ్సీహెచ్ అడిషనల్ డైరెక్టర్ అనిల్‌కుమార్, రాష్ట్ర సంచాలకుల కార్యాలయ డీడీ విజయలక్ష్మికి వినతిపత్రాలను అందజేశారు.

సేవలను సకాలంలో అందజేయండి



మాట్లాడుతున్న నందన్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని సచివాలయాల్లో పౌర సేవలను నిర్దేశిత సమయంలోపు అందజేయాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అడ్మిన్, రెవెన్యూ కార్యదర్శులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్దేశించిన జాబ్ చార్టుల మేరకు విధులను క్రమం తప్పకుండా పాటించాలని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలను నిర్దేశించిన సమయంలోపు పరిష్కరించాలని సూచించారు. ఆర్డీఓ అనూష, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, రూరల్ తహసీల్దార్ కృష్ణప్రసాద్, రెవెన్యూ అధికారులు సమద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

- పురపాలక సేవలను సులభతరం చేసేందుకుగానూ పురమిత్ర యాప్‌ను రూపొందించారని కమిషనర్ నందన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పన్నులకు సంబంధించిన బిల్లులు, సమస్యలను దీని ద్వారా తెలియజేయొచ్చని చెప్పారు. ఫిర్యాదుల స్థితిని తెలుసుకునేందుకు ట్రాకింగ్ విధానం అమల్లో ఉందని తెలిపారు.

రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించండి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు

నెల్లూరు సిటీ: రైతులు తమ పొలాల్లో రసాయనిక ఎరువులను తక్కువగా వినియోగించాలని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి పేర్కొన్నారు. కొండ్లపూడి, దేవరపాళెంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎకరాకు యూరియాను మూడు బస్తాల కంటే ఎక్కువ వినియోగించొద్దని కోరారు. నానో యూరియాను పిచికారీ చేస్తే అధిక దిగుబడులను సాధించొచ్చని వివరించారు. వ్యవసాయాధికారులు నర్సోజీ, శ్రీదేవి, నాగమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతానందన్ మృతి తీరని లోటు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): కమ్యూనిస్ట్ పోరాట యోధుడు, కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్ మృతి పార్టీకి తీరనిలోటని సీపీఎం నేతలు పేర్కొన్నారు. బాలాజీనగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి మంగళవారం నివాళులర్పించారు. పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, గోగుల శ్రీనివాసులు, వెంగయ్య, పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు దయాకర్, నాగేశ్వరరావు, ప్రసాద్, అన్నపూర్ణమ్మ, నేతలు చంద్ర రాజగోపాల్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా ప్లాంటేషన్ ప్రక్రియ



మాట్లాడుతున్న గంగాభవాని

నెల్లూరు (పొగతోట): జిల్లాలో ప్లాంటేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని డ్వామా పీడీ గంగాభవాని ఆదేశించారు. నగరంలోని డ్వామా కార్యాలయం నుంచి వివిధ మండలాల అధికారులతో మంగళవారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీల సంఖ్య వర్షాల కారణంగా వారం రోజులుగా తగ్గిందని చెప్పారు. ఈ సంఖ్యను పెంచి, రోజూ లక్ష మందికి తగ్గకుండా హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. క్షేత్రస్థాయి సిబ్బంది నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నెల్లూరు సిటీ: నగరంలోని 41వ డివిజన్ మనుమసిద్ధినగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మంగళవారం చేపట్టారు. కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీ కార్పొరేటర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ క్రీడాకారుల ఎంపిక రేపు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): స్పోర్ట్స్ క్యాలెండర్ మేరకు ఏపీ ట్రాన్స్‌కో ఉత్తర్వుల విద్యుత్ క్రీడాకారులకు పోటీలను సీలేరులో ఆగస్టు ఐదు నుంచి ఎనిమిది వరకు నిర్వహించనున్నామని ఎస్పీడీసీఎల్ జిల్లా స్పోర్ట్స్, గేమ్స్ సెక్రటరీ రామస్వామి వేలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా సర్కిల్లో విధులు నిర్వర్తిస్తున్న రెగ్యులర్ ఉద్యోగులు, జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్ – 2లు అర్హులని చెప్పారు. ఆసక్తి గల వారు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో గురువారం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించనున్న సెలక్షన్ ట్రయల్స్‌కు హాజరుకావాలని కోరారు. వివరాలకు 90308 02038, 94946 11228 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు

నెల్లూరు(క్రైమ్): మత్తు, మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని పోలీస్ అధికారులు సూచించారు. రావూస్ డిగ్రీ కళాశాలలో చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు.. వనంతోపులోని మాస్టర్‌మైండ్స్ జూనియర్ కళాశాలలో వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈగల్ క్లబ్ కార్యకలాపాలు, ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972పై వివరించారు.

పరస్పర ఫిర్యాదులు

నెల్లూరు(క్రైమ్): తనపై సీఐటీయూ నేత, మరికొందరు దాడి చేశారంటూ ట్రాక్టర్ యజమాని.. కులంపేరుతో దూషించి తనపై దాడికి పాల్పడ్డారంటూ ఆప్కాస్ ఉద్యోగిని చిన్నబజార్ పోలీసులకు పరస్పర ఫిర్యాదులు చేశారు. వివరాలు.. ట్రాక్టర్ ట్రాన్స్‌పోర్ట్స్‌లో నేతాజీనగర్‌కు చెందిన గోపీ పనిచేస్తున్నారు. తన రెండు ట్రాక్టర్లను ఇంటి సమీపంలోని పుత్తా ఎస్టేట్స్ వద్ద పెట్టారు. ఈ తరుణంలో వాహనాలకు గాలిని సీఐటీయూ నేతలు కత్తి శ్రీనివాసులు, మరికొందరు తీస్తుండగా అడ్డుకోగా, తనపై దాడి చేశారంటూ గోపీ ఫిర్యాదు చేశారు. మరోవైపు ధర్నా చేస్తున్న తనను గోపీ కులంపేరుతో దూషించి దాడి చేశారంటూ ఆప్కాస్ ఉద్యోగిని యమూరి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రదోషకాల పూజలు





నెల్లూరు(బృందావనం): ఆషాఢ మాస త్రయోదశిని పురస్కరించుకొని మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో అభిషేకాలు, అర్చనలు, ప్రదోషకాల పూజలను విశేషంగా మంగళవారం నిర్వహించారు. చిన్న వెండి నంది వాహనంపై నగరోత్సవాన్ని వేడుకగా జరిపారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

- రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో మీనాక్షి, సుందరేశ్వరస్వామి, నందీశ్వరుడికి ప్రదోషకాల పూజలను నిర్వహించారు. ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

లోపాలుంటే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ వినియోగదారుల నుంచి కలెక్టర్‌కు ఫిర్యాదులందుతున్న నేపథ్యంలో ఆయన సీరియస్‌గా ఉన్నారని.. పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే చర్యలు తప్పవని ఎస్పీడీసీఎల్ జిల్లా ఎస్‌ఈ విజయన్ స్పష్టం చేశారు. నెల్లూరు టౌన్ డివిజన్ విద్యుత్ అధికారులతో నగరంలోని టౌన్ – 1 ఎలక్ట్రిసిటీ రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు, సిబ్బంది వారికి కేటాయించిన హెడ్‌క్వార్టర్స్‌లోనే నివాసం ఉండాలని ఆదేశించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను వసూలు చేయాలని కోరారు. సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఆదర్శ రైతులకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న మల్లికార్జునరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలోని అన్ని మండలాల్లో గల గిరిజన ఆదర్శ రైతులకు వివిధ పథకాలపై అవగాహన సదస్సును నగరంలోని ఐటీడీఏ ప్రాజెక్ట్ కార్యాలయంలో పీఓ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఉద్యాన, వ్యవసాయ, మైక్రో ఇరిగేషన్, డ్వామా, పశుసంవర్థక శాఖల వారు అవగాహన కల్పించారు. సమస్యలపై అర్జీలను స్వీకరించారు.

మున్సిపల్ కార్మికుల బైఠాయింపు



నెల్లూరు(బారకాసు): పారిశుధ్య పనులను కాంట్రాక్టర్లకు అప్పగించే టెండర్లను రద్దు చేయాలనే డిమాండ్‌తో తమ పోరాటాన్ని మున్సిపల్ వర్కర్లు ఉధృతం చేశారు. నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయ సమీపంలో గల వెహికల్ షెడ్డు వద్ద మున్సిపల్ కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళనను మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టారు. షెడ్డు వద్ద వాహనాలను బయటకు వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న కమిషనర్ నందన్ చేరుకొని మున్సిపల్ కార్మికుల నేతలతో చర్చలు జరిపారు. ప్రైవేట్ కాంట్రాక్టర్లకు ఇచ్చే టెండర్ విషయమై హామీ ఇవ్వకపోవడంతో సమ్మెను కొనసాగిస్తామని తేల్చిచెప్పారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుజాతమ్మ, రెహానాబేగం మద్దతు తెలిపారు. పోలీసులను పెద్ద ఎత్తున మోహరించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పెంచలనరసయ్య, నగర గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు, కొండా ప్రసాద్, సుధాకర్, దేశమూర్తి, కామాక్షమ్మ, కొండమ్మ, సుజాతమ్మ, వజ్రమ్మ, రాంబాబు, భారతి తదితరులు పాల్గొన్నారు.

బేస్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ



నెల్లూరు (టౌన్): కదిరిలో ఇటీవల నిర్వహించిన బేస్‌బాల్ రాష్ట్ర స్థాయి సీనియర్స్ మహిళా విభాగ పోటీల్లో కేఏసీ జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సర విద్యార్థి పురందేశ్వరి రజత పతకాన్ని సాధించారు. పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినిని ప్రిన్సిపల్ శ్రీనివాసులు రెడ్డి అభినందించారు. ఫిజికల్ డైరెక్టర్ పాటూరు వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శేషయ్యకు నివాళులు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): బాలాజీనగర్‌కు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత అశోక్ తండ్రి శేషయ్య మంగళవారం మృతి చెందారు. ఈ క్రమంలో ఆయన భౌతికకాయానికి పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

పీఏసీఎస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పీ4 ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బంగారు కుటుంబాల దత్తత కార్యక్రమాన్ని సహకార శాఖ నిర్వహిస్తోందని డీసీఓ గుర్రప్ప పేర్కొన్నారు. నగరంలోని డీసీఓ కార్యాలయం నుంచి జిల్లా సహకార శాఖ, పీఏసీఎస్ అధికారులతో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలో 300 కుటుంబాలను గుర్తించి దత్తత తీసుకునేలా సహకారం అందించాలని సూచించారు. డీసీఏఓ తిరుపాల్‌రెడ్డి, కావలి, కందుకూరు డీఎల్సీఓలు రాజశేఖర్, రవిచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఆదిశంకర ధ్యాన మందిరంలో పూజలు నేడు

నెల్లూరు(బృందావనం): పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో సామూహిక మహాన్యాసపూర్వక ఏకాదశ పూర్ణ రుద్రాభిషేకాలు, అర్చనలను బుధవారం నిర్వహించనున్నామని చక్రాల వారి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనంద్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఫణిరాజు

నెల్లూరు రూరల్: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా యాకసిరి ఫణిరాజు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు సత్కరించారు.

